'అమ్మ పేరుతో మొక్క నాటండి'



అవగాహన కల్పిస్తున్న శానిటర్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, మారుతి

ఘట్‌కేసర్: స్వచ్ఛత హీ సేవా–2024లో భాగంగా (ఏక్ పేడ్ మ్మాకే నామ్) ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్కను నాటి సంరక్షించాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీను అన్నారు. ఆరో వార్డు ప్రజలకు తడి పొడి చెత్తపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటి పరిసరాలు, రోడ్డు పక్కన చెత్తను వేయరాదని సూచించారు. హానికారక చెత్తను వేరు చేసి తమ ఇళ్ల వద్దకు వచ్చే వాహనాల్లో వేసి స్వచ్ఛ మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ మారుతి, యోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో పౌష్టికాహార లోపం ఉండొద్దు

నాగారం చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

కీసర: చిన్నారుల్లో పౌష్టికాహార లోపం లేకుండా తగు జాగ్రతలు తీసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో పోషణమాసం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్రమోదీ భారతదేశంలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార లోపం లేకుండా ఉండటానికి పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏడుగురు గర్భిణులకు చైర్మన్ చంద్రారెడ్డి రూ. 1000 చొప్పున ఆర్థికసాయం అందజేసి సాముహిక సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. మేడ్చల్ సీడీపీఓ శారద, మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు పంగహరిబాబు, శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్స్, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

డీఈఓ విజయ కుమారి



మాట్లాడుతున్న విజయకుమారి

శామీర్‌పేట్: శ్రద్ధగా చదివి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిల్లా విద్యా శాఖాధికారి (డీఈఓ) విజయకుమారి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లో టాటా కంపెనీ సహకారంతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ... ప్రభుత్వం, దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. ఈ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తామని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వసంతకుమారి, ప్రధానోపాధ్యాయులు వేణు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా రూరల్ జిల్లా నూతన కమిటీ



జవహర్‌నగర్: బీజేపీ ఓబీసీ మోర్చా రూరల్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని శనివారం నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందచేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు గొంగ్ల మహేష్, గుండ్ల ఆంజనేయులు, రామోజీ, శ్రీరాములు, శంకర్ పాల్గొన్నారు.

రూ. 2 లక్షలకు గణనాథుడి లడ్డూ వేలం



లడ్డూ దక్కించుకున్న బలవంతరెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని గోధుమకుంటలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద శుక్రవారం రాత్రి నిర్వహించిన గణనాథుడి లడ్డూను వేలం పాటలో వంగేటి బలవంతరెడ్డి రూ. 2 లక్షలకు సొంతం చేసుకున్నారు. స్వామివారి మేడలో ఏర్పాటు చేసిన నోట్ల రూపాయల మాలను రూ. 45 వేలకు వేలం పాటలో వంగేటి (ఎర్రోళ్ల) మహేందర్‌రెడ్డి దక్కించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి, గోధుమకుంట రెడ్డి సంఘం అధ్యక్షుడు వంగేటి ధన్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతకు వయసు అడ్డంకి కాదు

సెయింట్ పీటర్స్‌లో 'స్పెక్యాథోన్ 2కే24'

మేడ్చల్‌రూరల్: సృజనాత్మకతకు వయసుతో సంబంధం లేదని విద్యార్థి స్థాయిలో ఉన్నవారు సైతం ఎంఎన్సీ కంపెనీలు స్థాపించి ఉన్నత స్థానాల్లో ఉన్నారని సెయింట్ పీటర్స్ కళాశాల చైర్మన్ బాలారెడ్డి, సెక్రటరీ టి.వి.రెడ్డి అన్నారు. మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ కళాశాలలో స్పెక్యాథోన్ పేరిట 36 గంటల పాటు జాతీయ స్థాయి హ్యాకథాన్ నిర్వహించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల బృందాలు హ్యాకథాన్‌లో పాల్గొన్నాయి. విజేతలుగా నిలిచిన మూడు బృందాలకు శనివారం ముగింపు సదస్సులో నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ... తమలోని నైపుణ్యాలను వెలికితీసి ఉన్నత స్థానాల్లో నిలిచేందుకు వయసు అడ్డంకి కాదన్నారు. ఈ సందర్భంగా పలువురి విజయగాథలను ఉదహరించారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల మేథోశక్తి మరింత పెరుగుతుందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఇక్కడ వచ్చిన ఆలోచనతో ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా ఎదగాలని కోరారు. సదస్సులో సీనియర్ ఆర్కిటెక్ వెంకట్‌రెడ్డి, ఎల్ అండ్‌టీ డైరెక్టర్ సుధీర్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సల్మాన్ అబ్దుల్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, ఠాకూర్ అజయ్‌సింగ్, నర్సింహారావు, కో ఆర్డినేటర్ దీపన్, హర్షారెడ్డి, టీపీఓ శ్రీకాంత్, పీఆర్వో రవిసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

- టీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా వినోద్‌కుమార్, కురుమూర్తి



టీజీవో జిల్లా కార్యవర్గ సభ్యులు

సాక్షి, సిటీబ్యూరో: గత ప్రభుత్వం ఉద్యోగ సంఘాలకు విడదీసి పాలన చేసిందని, ఇప్పటికీ కొన్ని కొత్త సంఘాలు పుట్టుకొచ్చి, ఉద్యోగుల మధ్య గందరగోళం సృష్టించే పనిచేస్తున్నాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం నగర శివారులో ఏర్పాటు చేసిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఇందులో నూతన జిల్లా కమిటీ ఎన్నిక ప్రక్రియను అసోసియేషన్ మాజీ ట్రెజరర్ ఉపేందర్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం డీఏలను పెండింగ్‌లో పెట్టిందని, హెల్త్ కార్డుల విషయాన్ని తేల్చలేదన్నారు. వోడీలు లేవని విమర్శించారు. ఉద్యోగులకు గజం జాగా కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు మనం కోరుకున్న ప్రభుత్వం వచ్చిందని, ఉద్యోగుల ఐక్య కార్యాచరణతో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. టీజీవో అసోసియేషన్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని, అందులో భాగంగా జిల్లాలలో సమావేశాలు, ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ... అసోసియేషన్‌ను బలోపేతానికే సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మేడ్చల్ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ.. 2023లో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి వివిధ శాఖల అధికారుల సహకారంతో కొన్ని సమస్యలు పరిష్కరించుకున్నారు. అసోసియేషన్ మాజీ ట్రెజరర్ ఉపేందర్ రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, నూతన జిల్లా కమిటీ ఎన్నికలకు సంబంధించి అన్ని పోస్టులకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావటంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. నూతన కమిటీ మూడేళ్ల పాటు కొనసాగనుంది.

టీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బి.వినోద్‌కుమార్

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా టీజీవో అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి బి.వినోద్ కుమార్, కార్యదర్శిగా పశు సంవర్ధక శాఖ వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ కురుమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 19 మందితో అసోసియేషన్ నూతన కమిటీని సమావేశం ఎన్నుకుంది. ఇందులో అసోసియేట్ ప్రెసిడెంట్‌గా జిల్లా ఆడిట్ ఆఫీసర్ కె. వెంకటేశం, ఉపాధ్యక్షుడిగా ఐ.విజయకుమారి, డి.రవీందర్, ఎం.రఘునందన్‌గౌడ్, జాయింట్ సెక్రటరీగా విష్ణు వర్ధన్ రావు (ఎఫ్ఆర్‌వో), ఎం.అర్చన, ఆర్ఎంపీ ఆనంద రావు, ట్రెజరర్‌గా డి.కరుణాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా సి.హెచ్.రమేష్, పబ్లిసిటీ సెక్రటరీగా డాక్టర్ ఇ.సత్యనారాయణ, ఆఫీసు సెక్రటరీగా ఎస్.సాయికృష్ణ, కల్చరల్ సెక్రటరీ గా బి.నాగమణి, స్పోర్ట్స్ సెక్రటరీగా పి.శంకరయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ శ్యామల, హెచ్.నాయుడు, డాక్టర్ ఎస్.స్వాతి, పి.డాలి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

కృత్రిమ మేధపై జాతీయ స్థాయి హ్యాకథాన్



హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థులతో ఆర్ఆర్ఎస్ సొల్యూషన్స్ ఎండీ ధీరజ్‌రెడ్డి

పోచారం: చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా జాతీయ స్థాయిలో జనరేటివ్ కృత్రిమ మేధ (జెన్ఏఐ)పై హ్యాకథాన్‌ను శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆర్ఆర్ఎస్ సొల్యూషన్స్ ఎండీ టి. ధీరజ్‌రెడ్డి, వర్చ్యూసా వైస్ ప్రెసిడెంట్ ఇ.రవీంద్రప్రసాద్, గౌరవ అతిథులుగా కళాశాల వైస్ చైర్మన్ నల్ల ప్రశాంత్‌రెడ్డి, ఈఏఐఈఎస్‌బీ డైరెక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ధీరజ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి కోడ్ రాయకుండానే కృత్రిమ మేధతో ప్రోగ్రామింగ్ చేయించవచ్చన్నారు. జెన్ఏఐతో అనేక సమస్యలకు పరిష్కారాలు పొందవచ్చన్నారు. రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ... సమస్యల నివేదికను నిర్వచించే డొమైన్ జ్ఞానం విద్యార్థులకు కావాలన్నారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ.. భగవద్గీత శ్లోకాలను సహజమైన భాషా ప్రక్రియతో అద్భుతాలు చేయవచ్చన్నారు. మొత్తం రిజిస్ట్రేషన్ చేయించుకున్న 98 గ్రూపుల నుండి 75 జట్లు హ్యాకథాన్‌లో పాల్గొన్నాయి. ప్రతిభ చూపించిన విద్యార్థులకు బహుమతులను కళాశాల యాజమాన్యం అందజేసింది. స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ జి.జనార్ధన్‌రాజు కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా.సీవీ కృష్ణారెడ్డి, సీఎస్ఈ విభాగాధిపతి కె.రామేశ్వరయ్య, టీపీఓ కె.శ్రీకాంత్, ఐబీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జి.సుబ్బారావు, అధ్యాపక బృందం, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

ఎంబీపీ మోర్చా జిల్లా కో కన్వీనర్‌గా రఘు



నియామక పత్రం అందుకుంటున్న రఘు వంజరి

ఘట్‌కేసర్: ఓబీసీ మోర్చా ఎంబీసీ జిల్లా కో కన్వీనర్‌గా ఎదులాబాద్‌కు చెందిన సాల్వేరు రఘు వంజరి నియమితులయ్యారు. బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి ఆయనను నియమించగా ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి శనివారం నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని ఎంబీసీల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మహేందర్ యాదవ్, రాష్ట్ర నాయకులు ఆంజనేయులుగౌడ్, రామోజీ, మహేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

'గుడ్ టచ్–బ్యాడ్ టచ్'పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మేడ్చల్‌రూరల్: కండ్లకోయలోని సీఎంఆర్ఐటీ ఎన్ఎస్ఎస్ కళాశాల విద్యార్థులు శనివారం మేడ్చల్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థులకు మంచి స్పర్శ–చెడు స్పర్శ (గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్)పై అవగాహన కల్పించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సెమినార్లు, వీడియో ప్రదర్శనల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రత్న, సీఎంఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ మదుసూదన్‌రావు, ఎన్ఎస్ఎస్ పీఓ నిఖిల మాట్లాడుతూ... ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడమే లక్ష్యంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సైతం ఈ అంశంపై చర్చించి వారిలో ధైర్యాన్ని నింపాలని కోరారు.

రామలింగేశ్వర స్వామి సేవలో డీఈఓ



కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామిసేవలో శనివారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వైద్యాధికారి డాక్టర్ రఘునాథస్వామి పాల్గొన్నారు. కీసరగుట్ట దేవాలయానికి విచ్చేసిన జిల్లా వైద్యాధికారి రఘునాథస్వామికి ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు జిల్లా వైద్యాధికారికి స్వామివారి ఆశీర్వచనంతో పాటు, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ

కీసర: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న చీర్యాల శ్రీ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం వద్ద ప్రతి శనివారం భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ధర్మకర్త శ్రీహరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన జోనల్ క్రీడలు



విజేతులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ముఖ్యఅతిథులు

ఘట్‌కేసర్: ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 68వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలో జరుగుతున్న జోనల్ స్థాయి క్రీడలు శనివారం ఘనంగా ముగిశాయి. అండర్ 17 కబడ్డీ బాలికల విజేతగా ఎస్వీఆర్, అండర్ 17 బాలుర కబడ్డీ విజేతగా మహాత్మ జ్యోతిరావుపూలే స్కూల్ ఘనాపూర్, అండర్ 14 బాలికల విజేతగా అవుషాపూర్ అప్పర్ ప్రైమరీ స్కూల్, అండర్ 14 బాలుర విజేతగా ఎస్వీఆర్ స్కూల్, అండర్ 17 బాలికల వాలీబాల్ విజేతగా తెలంగాణ సోషల్ వెల్ఫేర్ అంకుషాపూర్, అండర్ 17 బాలుర విజేతగా జడ్పీ ఎదులాబాద్, అండర్ 14 బాలికల విజేతగా విద్యాజ్యోతి స్కూల్, అండర్ 14 బాలుర వాలీబాల్ విజేతగా ఎస్వీఆర్ స్కూల్ జట్టు విజేతగా నిలిచింది. ముఖ్య అతిథిగా హాజరైన ఇంటర్నేషనల్ అథ్లెట్ కల్పనారెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రెడ్డి రాంరెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ రాఘవేంద్రరెడ్డి మచ్చ విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నీతూగుప్తా పూరి, డైరెక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి, రాధికగుప్తరెడ్డి, జోన్ గేమ్స్ సెక్రటరీ శ్రీరాములు, ఇతర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రాచీన చరిత్రపై విద్యార్థుల ప్రదర్శన



విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న చైర్ పర్సన్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని నీరజ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం విద్యార్థులు చేపట్టిన ఇతిహాస, భారతదేశ ప్రాచీన చారిత్రక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రాచీన భారతదేశంలో మొట్టమొదటి వాణిజ్య, వ్యాపారాలు, నాటి రాజులు, ప్రభువులు పరిపాలించిన రాజ్యాలు, సామ్రాజ్యాలు, రాజులు కట్టించిన కట్టడాలు, విశ్వ విద్యాలయాలు, వాస్తుకళ, ప్రాచీన ఖగోళ శాస్త్రం, యుద్ధ, హస్త కళలు, నృత్యాలులపై విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనలతో వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన నీరజ్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్ పర్సన్ జ్యోతిరెడ్డి విద్యార్థుల ప్రతిభను అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రం పథకాలకు ప్రజాదరణ

ఎంపీ ఈటల రాజేందర్



నాగారంలో బీజేపీ సభ్యత్వాన్ని అందజేస్తున్నఎంపీ ఈటల రాజేందర్

కీసర: కేంద్రంలోని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా ప్రజలు పెద్ద ఎత్తున బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారని మేడ్చల్–మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ... రాష్ట్రంలో పేదప్రజలు ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయ్యిందన్నారు. ఆ అంశాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు హైడ్రా పేరుతో కాలయాపన చేస్తున్నదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్‌కు ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ వైపు ప్రజలు ఆకర్షితులయ్యేలా స్థానిక నేతలు కృషి చేయాలన్నారు. బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రం రెడ్డి, నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, జిల్లా నేతలు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లా తిరుమల్‌రెడ్డి, నాగారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు బుద్ధవరం వేణు, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మీ, సూర్యశేఖర్‌రెడ్డి, జంగారెడ్డి, నక్క కిషోర్, రవీందర్, సురేందర్, వెంకటేశ్వరరావు, అక్కల సురేష్, జూపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత'లో భాగస్వామ్యం కావాలి



పరిశుభ్రతలో పాల్గొన్న చైర్మన్ తదితరులు

కీసర: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ప్రజలంగా భాగస్వామ్యం కావాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 6, 18వ వార్డుల్లో నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ప్రజలు తాము నివసించే పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాలనీవాసులు, దుకాణ సుముదాయాల వారు చెత్తను ఎక్కడికక్కడ పడేయకుండా డోర్ టూ డోర్ వచ్చే చెత్త ఆటోవారికి అందజేయాలన్నారు. పురపాలక సంఘం కార్యాలయం నుంచి వికాస్‌నగర్, హనుమాన్ల టెంపుల్ రోడ్లను శుభ్రపర్చడంతోపాటు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్లు కొంకుట్ల అనంతరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



మేడ్చల్: పట్టణంలోని సంప్రద ఆస్పత్రిలో శనివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆస్పత్రి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన శిబిరంలో వైద్యులు, సిబ్బంది తమ రక్తాన్ని దానం చేశారు. ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ సందీప్, వైద్యులు పాల్గొన్నారు.

నియామకం

కీసర: బీజేపీ ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులుగా తిమ్మాయిపల్లికి చెందిన దొబ్బల శ్రీశైలం నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో శనివారం బీజేపీ నేతలు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాగుల అశోక్‌ముదిరాజ్, బోద శ్రీనివాస్‌రావు, కోలబాల్ రాజ్‌యాదవ్, నల్లవెంకట్‌రెడ్డిలు ఆయను శాలువతో ఘనంగా సత్కరించి అభినందించారు.



కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



వృద్ధులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

జవహర్‌నగర్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పద్మశాలి సంఘం అధ్యర్యంలో శనివారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్‌లోని ఆదర్శ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ గుండ్రాతి లక్ష్మీకృష్ణగౌడ్, మాజీ వార్డు సభ్యులు ప్రసాద్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన తుది శ్వాస వరకు పోరాడిన గొప్ప మహనీయుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్టిమల్ల గణేష్ నేత, ప్రధాన కార్యదర్శి ఎర్రమాద హరినారాయణ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొమ్మ ప్రవల్లిక అమర్ నేత, బోనకుర్తి శ్రీనివాస్, కటకం శ్రీనివాస్, బొమ్మ అమరేందర్, విజయకుమార్, ప్రసాద్, గణేష్, ప్రశాంత్, చక్రపాణి పాల్గొన్నారు.

దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలో...

కీసర: ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను శనివారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని పద్మశాలి టౌన్‌షిప్ వద్ద ఘనంగా నిర్వహించారు. లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు చిట్టిమల్ల గణేష్, భావన రుషి హౌసింగ్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ వసుపతి ప్రణితా శ్రీకాంత్‌గౌడ్ పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



దమ్మాయిగూడ మున్సిపాలిటీలో...

కూతురికి అన్నం వండిపెట్టమని పిలిచి అత్యాచారం

వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు నిందితులకు రిమాండ్

మేడ్చల్‌రూరల్: వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడిన ఘటనలో ఇద్దరు నిందితులను శనివారం మేడ్చల్ పోలీసులు రిమాండ్ చేశారు. ఈ మేరకు కేసు వివరాలను పోలీసులు ప్రెస్‌నోట్ ద్వారా వెల్లడించారు. వివరాలివీ... బండమాదారం గ్రామంలో ఓ వృద్ధురాలు (74) ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. ఈ నెల 19న రాత్రి 8.30 గంటల సమయంలో వృద్ధురాలు ఇంటి సమీపంలో ఉండే వెంకట్‌రావు(26) ఆమె ఇంటికి వచ్చి తన భార్య ఊరికి వెళ్లిందని తన కూతురికి అన్నం వండిపెట్టేందుకు తన ఇంటికి రావాలని వృద్ధురాలిని కోరగా ఆమె వెంకట్‌రావు ఇంటికి వెళ్లి అన్నం వండడం ప్రారంభించింది. అదే సమయంలో తన మిత్రుడు రాయిలాపూర్ గ్రామానికి చెందిన నవాజ్(20) వెంకట్‌రావు ఇంటికి రాగా ఇద్దరు కలిసి ఇంటి ముందు మద్యం సేవించారు. అప్పటికే వంట పూర్తి చేసి వెంకట్‌రావు కూతురికి వడ్డించిన వృద్ధురాలు తాను ఇంటికి వెళ్తానని చెప్పగా మాకు కూడా అన్నం వడ్డించమని కోరడంతో వృద్ధురాలు వారిద్దరికి సైతం అన్నం వడ్డించి ఇక్కడే తన కూతురితో పాటు నిద్రించాలని కోరగా వృద్ధురాలు వెంకటరావు అభ్యర్థనను తిరస్కరించింది. దీంతో అతను బతిమాలడంలో చివరకు అంగీకరించి అక్కడే ఉంది. అనంతరం వెంకట్‌రావు బాధితురాలికి గ్లాసులో మద్యం పోసి ఇచ్చి సేవించాలని కోరగా ఆమె తిరస్కరించడంతో బలవంతంగా మద్యం తాగించాడు. దీంతో బాధితురాలికి నిద్ర మత్తు రావడంతో అక్కడే వెంకట్‌రావు కూతురి వద్ద నిద్రించింది. బాధితురాలు నిద్రలోకి వెళ్లడాన్ని గమనించిన వెంకట్‌రావు గదిలో లైట్లు ఆఫ్ చేసి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం నవాజ్ సైతం ఆమెపై లైంగిక దాడి చేశాడు. వృద్ధురాలు బలహీనంగా ఉండటంతో గట్టిగా కేకలు పెట్టలేక, వారిని ఎదురించలేకపోవడంతో ఆమెకు తీవ్ర రక్తస్రావం కావడంతో అపస్మారక స్థితికి వెళ్లింది. నవాజ్ తన ఇంటికి వెళ్లిపోగా వెంకట్‌రావు తన కూతురిని తీసుకుని సోదరి ఇంటికి అక్కడ నిద్రించాడు. మరునాడు(శుక్రవారం) ఉదయం వెంకట్‌రావు ఇంటికి వచ్చేసరికి బాధిత వృద్ధురాలు ఇంకా అపస్మారక స్థితిలోనే కనిపించడంతో భయంతో అక్కడి నుండి పారిపోయాడు. కొంత సేపటికి స్పహలోకి వచ్చిన వృద్ధురాలు లేచి చూడగా ఎవరూ కనిపించలేదు. దీంతో రక్తస్రావం, నొప్పితో నెమ్మదిగా తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా గమనించిన స్థానికులు బాధిత వృద్ధురాలిని ప్రశ్నించడంతో ఆమె అసలు విషయం వివరించింది. దీంతో వారు 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా బాధితురాలిని మేడ్చల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాధితురాలి నుంచి వివరాలు సేకరించిన పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని నిందితులు వెంకట్‌రావు, నవాజ్ కోసం గాలింపు చేపట్టారు. నిందితులు పరారయ్యేందుకు శనివారం ఉదయం మేడ్చల్ బస్ డిపో వద్ద చేరుకోగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం రిమాండ్‌కు తరలించారు.